క్లుప్తంగా

నేడు వేసవి శిక్షణ శిబిరం ముగింపు

అచ్చంపేట రూరల్: స్వర్ణభారతి కళానిలయం కల్వకుర్తి వారి ఆధ్వర్యంలో అచ్చంపేట, తెలకపల్లి పట్టణాల్లో నిర్వహించిన వేసవి సంగీత నృత్య శిక్షణ శిబిరాల ముగింపు ఉత్సవాలు గురువారం అచ్చంపేటలోని పటేల్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తునట్లు స్వర్ణభారతి కళానిలయం సంస్థ కార్యదర్శి కె. నరేషాచారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారులు వివిధ అంశాలలో శిక్షణ పొందిన కళారూపాలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ ఠాగూర్, సంగీత దర్శకులు, పాడుతా తీయగా ఫేం రాజబాబు, పలువురు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

లింగాల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి గెలుపు పార్టీలో నూతనోత్సాహాన్ని నింపిందని అచ్చంపేట నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ అన్నారు. బుధవారం మండలంలోని దారారంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సంబరాలు చేసుకున్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల గ్రామానికి చెందిన కాజాబేగం పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు బుధవారం నేలమట్టం అయ్యింది. వర్షాలకు బాగా తడిసి ఇల్లు కూలిపోవడంతో కుటుంబం రోడ్డు పాలైంది. ఇంటి యజమానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో భర్త కూడా మృతి చెందాడని గ్రామస్తులు వాపోయారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ




వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కూన మనస్వి నీట్ ఫలితాల్లో 601 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చింది. బుధవారం విద్యార్థిని తల్లిదండ్రులు కూన శ్రీనివాసులు, పద్మలతో పాటు గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



తాడూరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం ద్వారా రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏఓ సాయిరమేష్ కుమార్, విండో చైర్మన్ రామచంద్రారెడ్డిలు తెలిపారు. బుధవారం జీలుగ విత్తనాల కోసం వచ్చిన రైతులకు జీలుగ విత్తనాలు వాడే విధానంపై అవగాహన కల్పించారు. 30 కేజీల జీలుగ విత్తనాల సంచి రూ.1120 లకు విక్రయిస్తునట్లే పేర్కొన్నారు. 55 క్వింటాళ్ల వరకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈఓ ఆంజనేయులు, సిబ్బంది శివ, సురేష్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అమ్రాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎస్‌ఆర్‌ఎల్‌ఎం సంస్థ ప్రతినిధి ఉషారాణి అన్నారు. బుధవారం ఎస్‌ఆర్‌ఎల్‌ఎం, ఆగాఖాన్ ఫౌండేషన్ బృంధం సభ్యులు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలతో మాట్లాడారు. పథకాలు, రుణాల గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళల అభివృద్ధికి తమ సంస్థల ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రామిరెడ్డి, సంస్థల ప్రతినిధులు రమేష్ ఆర్పిసింగ్, కిషోర్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన శేఖర్ అక్రమంగా ఇసుకను నాగర్‌కర్నూల్‌కు తరలిస్తుండగా పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగుకు సన్నద్ధం

పొలాల పనుల్లో రైతన్న నిమగ్నం



కోడేరులో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

కోడేరు: వానాకాలం పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పొలాల పనుల్లో నిమగ్నమయ్యారు. భూమిని చదును చేస్తూ దుక్కిలను దున్నుతున్నారు. పూడికతీత మట్టి తరలింపు పనులు ముమ్మరంగా చేపడుతూ రైతులు బిజీబిజీగా ఉన్నారు. గత సంవత్సరం వానాకాలం పంటలో వర్షాభావం తక్కువగా ఉండటంతో రైతులకు ఆశించినంత దిగుబడి రాలేదు. దీంతో ఇప్పటి నుంచే సాగు భూముల్లో సేంద్రియ ఎరువులు వేస్తూ భూసారం పెంచుకుంటున్నారు. ఈ నెల 25న రోహిణి కార్తె రావడంతో రైతులు వర్షాలు కురిస్తే పంటలకు అనుకూలంగా ఉంటుందని సాగు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో మొత్తం 52 వేల ఎకరాల భూమి ఉండగా గత వానాకాలం పంటలో రైతులు 18000 వేల ఎకరాలు సాగు చేశారు. వేరుశనగ 150 ఎకరాలు, కంది 300, పేసర 10, మొక్కజొన్న 1500, ఆముదం 20, వరి 1200, పత్తి 700, మామిడి 5300, పంటలను సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సారి పంటల సాగు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి...

సాగు ఖర్చును తగ్గించుకునేందుకు, భూసారం పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువులకు బదులుగా పశువుల పేడ, నల్లమట్టి తదితరాలతో తయారవుతున్న సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి పెడుతున్నారు. రైతులు డైయిరీ ఫామ్‌ల నుంచి ఆవుల పేడ తీసుకొచ్చి పంట చేనుల్లో వేస్తున్నారు. సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పొలాల్లో ఎరువులు చల్లుతున్నాం

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పొలాల పనుల్లో చేస్తున్నాం. వానాకాలం పంటలకు ఇప్పటి నుంచే పనులు ప్రారంభించాం. ప్రతి సంవత్సరం చేనుల్లో పశువుల పేడను సేంద్రియ ఎరువును వాడుతున్నాం. భూములు దుక్కులు దున్నుతున్నాం. – పర్వతాలు, రైతు, కోడేరు,

వేసవి దుక్కులతో లాభాలు

వేసవిలోనే దుక్కులు చేయడం వల్ల రైతులకు మంచి ఫలితం ఉంటుంది. నేల సారవంతమై పంట దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం.అధికారుల సూచనలు, సలహాలు పాటించాలి. – శ్రీరామ్, ఏఓ, కోడేరు

మండలాలకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు

నాగర్‌కర్నూల్: పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని టెస్ట్ బుక్స్ గోదాం నుంచి జిల్లాలోని వివిధ మండలాలకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ గోవిందరాజులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌పుస్తకాలు, బోధన ఎక్స్‌ట్రా కరికులం పుస్తకాలను మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయాలకు పంపించనున్నట్లు తెలియజేశారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అన్ని మండలాల కేంద్రాలకు చేరుతాయన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా టెస్ట్ బుక్స్ మేనేజర్ కురుమయ్య, పర్యవేక్షకులు నాగేందర్, టీచర్ వెంకటేశ్వర శెట్టి, సిబ్బంది సునీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చెంచుల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం



సీతారాం నాయక్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ

మన్ననూర్: చెంచులకు ఆర్థిక వనరులు సమకూర్చేందుకు, శానిటరీ న్యాప్‌కిన్ తయారీలో ప్రోత్సాహించేందుకు గిరిజన కోఆపరేటివ్ సంస్థ (జీసీసీ) తోడ్పాటు అందిస్తుందని జీసీసీ ఆర్‌ఎం సీతారాం నాయక్ అన్నారు. బుధవారం మన్ననూర్‌లోని జీసీసీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రికార్ స్కీమ్ ద్వార శానిటరీ న్యాప్‌కిన్ తయారీకి అవసరమైన (ఎంఎస్ ఎంఈ యూనిట్స్) ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఉట్నూర్, ఏటూరు నాగారం, భద్రాచలంలో ఇప్పటికే వీటి తయారీలో వినూత్నమైన ఫలితాలు వస్తున్నాయని, ఈ ప్రాంతంలో కూడా చెంచులకు స్వయం ఉపాధి కల్పించడం కోసం ప్రస్తుత కొత్త ప్రభుత్వం సమాలోచనలు చేస్తుందన్నారు. జీసీసీ విశ్రాంత ఉద్యోగి వెంకటరమణ, జీసీసీ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పూరి సాయిబాబు, అకౌంటెంట్ జయరాజ్, ఏపీఎం లక్ష్మయ్య, సిబ్బంది రాములు, రమణ, సత్యనారాయణ, మల్లేష్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



తెలకపల్లి: ఉపాధిహామీ చట్టం పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నందిపేట భాస్కర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు, సవాల్‌లు అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10న సదస్సు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. సదస్సుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, సీఐటీయూ నాయకులు బండారు హుస్సేన్, వెంకటయ్య, రాముడు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



కొల్లాపూర్ పీజీ కళాశాలలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



అవుసలికుంట అమృత సరోవర్ దగ్గర మొక్కలను నాటుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కోపోలోనియస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అవుసలికుంట, దారారంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో అమృత సరోవర్‌ల దగ్గర ఎంపీడీఓ ఆంజనేయులు మొక్కలను నాటించారు. ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాం అలీ, పంచాయతీ కార్యదర్శి చంద్రయ్య, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏపీడీ చంద్రశేఖర్ మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, కార్యదర్శులు గిరి, ఫైయాజ్, మంజుల, సైదమ్మ, రూప్‌సింగ్, టీఏలు ఉన్నారు.

మన్ననూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ డీఆర్‌ఓ లక్ష్మీకాంతరావు అన్నారు. అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో పర్యావరణం పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ స్వప్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, అంబనారాయణ, బాలకిష్టమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు తదితర అన్ని గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్, మంచాలకట్ట, జటప్రోల్ గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిరిగిరి శంకర్, ఆంజనేయులు, కురుమయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మాతృభూమి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాటన్ క్లాత్ బ్యాగులను తయారు చేసి పలువురికి పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, గంజి చంద్రశేఖర్, అశోక్‌రెడ్డి, సాయిబాబు, సంస్థ ఫౌండర్ మంజుల, రమాకాంత్, కాశన్నయాదవ్, చెన్నకేశవులు, ప్రసాద్, చంద్రకళ, నస్రీన్, వివేకవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గట్టునెల్లికుదురు, గౌరెడ్డిపల్లి గ్రామాల్లో అమృత్‌సరోవర్ చెరువుల దగ్గర ఎంపీడీఓ కృష్ణయ్య మొక్కలు నాటి ఉపాధి కూలీలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ మల్లారెడ్డి పాల్గొన్నారు.



తెలకపల్లి మండలం గట్టునెల్లికుదురులో



పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో



ఉప్పునుంతలలో రోడ్డు వెంట మొక్కలు నాటుతున్న ఈజీఎస్ కూలీలు



వెల్దండలో

బండరాళ్ల తొలగింపు



దోమలపెంట: రెండో రోజుల కిందట కురిసిన వర్షం వలన శ్రీశైలం ఆనకట్ట ఘాట్‌రోడ్డులో పడిన కొండచరియలు, పెద్ద పెద్ద బండ రాళ్లు పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆర్టీసి బస్సులు బండరాళ్ల మధ్య నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఎంపీటీసీ బి మల్లిఖార్జున స్పందించి స్వంత ఖర్చులతో బుధవారం కూలీలతో రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

తండాల్లో ఎక్సైజ్ పోలీసుల దాడులు



ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండా, గుట్టమీది తండా, ఉప్పునుంతల, కాంసానిపల్లి తండాలో బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. 38 లీటర్ల సార, 15 కేజీల పటిక, 60 కేజీల బెల్లం స్వాదీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఐదు మందిపై కేసులు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయిత్రి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా టాస్క్‌ఫోర్స్, తెల్కపల్లి సర్కిల్ ఎక్సైజ్ బృందాలు ఉమ్మడిగా దాడులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకిష్టారెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ అరుణ, ఎస్‌ఐ జనార్దన్ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పురోగతిపై సమీక్ష



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు



ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య, ఏఈ మల్లారెడ్డి

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విద్యాశాఖకు సంబంధించి మండల స్థాయి సమీక్ష సమావేశం బుధవారం వారం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఎంపీడీఓ పట్టాభిరామారావు, ఎంఈఓ ఎస్.చంద్రుడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పాటు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మరమ్మతు, నీటి వసతులు, విద్యుత్ సదుపాయం, టాయిలెట్ల నిర్మాణాలకు గురించి అడిగి తెలుసుకున్నారు. జూన్ 12 వతేదీ లోపు ఆయా పనులను పూర్తిచేసేలా పాఠశాల కమిటీలు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరెడ్డి ఉన్నత పాఠశాల, పెద్దూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాల, పెద్దపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాల, ఆలేరు ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బొప్పల్లి ప్రాథమికోన్నత పాఠశాల, బోరబండతాండా ప్రాథమిక పాఠశాల, వట్టిపల్లి ప్రాథమికోన్నత, కమ్మరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించి పనులను పరిశీలించారు. త్వరితగతిన పాఠశాల పనులను పూర్తి చేయాలని కోరారు.

చారకొండ: మండల కేంద్రంలో ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ శంకర్ నాయక్ పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలలు, బడిబాటపై అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి, పీఆర్ ఎఈ మోనిక, సీఆర్‌పీ యాదయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులపై అవగాహన



తాడూరులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ



తెలకపల్లి మండలం వట్టిపల్లిలో మాట్లాడుతున్న ప్రమీల

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధి పనుల ప్రదేశాల వద్ద కూలీలకు ఏర్పాట్లు, వివిధ అంశాలపై ఏపీఓ చంద్రసిద్దార్థ, ఎంపీఓ లక్ష్మన్‌నాయక్‌లు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జ్యోతిపరోసియా గ్రామాల వారిగా పనుల వివరాలు, వివిధ అంశాలపై క్షేత్రసహాయకులతో సమీక్షించారు. ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలని వారు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని వట్టిపల్లిలో ఉపాధిహామీ కూలీలకు జిల్లా చైల్డ్ లైన్ 1098 నిర్వాహకురాలు ప్రమీల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. మూఢనమ్మకాలను, బాల్యవివాహాలను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని సూచించారు. పలు జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ రఘు, మేట్, శివ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

లింగాల: మండలంలోని రెవెన్యూ శాఖ సర్వే డిపార్టుమెంట్‌లో పని చేస్తున్న లింగాలకు చెందిన పెబ్బేటి ఎల్లమ్మ మంగళవారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఉమ బుధవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరుపున రూ. 20 వేలు ఆర్థికసాయం అందజేశారు. సర్వేయర్ రాంబాబు, ఎమ్మార్ఐ సీతారాంనాయక్, రెవెన్యూ సిబ్బంది, ఉన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన నీరటి మొగులమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కేజీల బియ్యం, 9 రకాల నిత్యవసర సరుకులను అందజేశారు. సేవా సమితి నాయకులు రవీందర్ రావు, నాగరాజుగౌడు, మల్లేష్, వీరేందర్, నరసింహ, రామస్వామి, సహదేవ్, శ్రీశైలం, కుమార్, తిరుపతయ్య, ఆంజనేయులు ఉన్నారు.



నిత్యవసర సరుకులను అందజేస్తున్న గ్రామ సేవ సమితి సభ్యులు

ప్రజాహక్కుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్

కొల్లాపూర్ రూరల్: ప్రజా హక్కుల పరిరక్షణే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ అన్నారు. బుధవారం మండలంలోని సింగోటం గ్రామ సమీపంలో శ్రీవారి సముద్రం కట్టపై ఉన్న టూరిజం గెస్ట్ హౌజ్‌లో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్మిక, కర్షక సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. దేశంలో సమాచార హక్కు చట్టం సాధించిన ఘనత సీపీఎంకే దక్కుతుందన్నారు. భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తే పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. అంతకుముందు శిక్షణ తరగతులు సందర్భంగా పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి పర్వతాలు ఎగరవేశారు. కార్యవర్గ సభ్యులు అంజనేయులు, శ్రీనివాసులు, గీత, మండల కార్యదర్శి శివవర్మ, జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, బాల్‌రెడ్డి, తారాసింగ్, అశోక్, సలీం, సురేందర్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘ భవనం కూల్చివేత



భవనం కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొల్లాపూర్: పట్టణంలోని రాజాబంగ్లాకు అనుసరించి ఉన్న ముదిరాజ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ సొసైటీ భవనాన్ని మంగళవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఈ భవన నిర్మాణంపై కొన్నేళ్లుగా సురభి రాజవంశ వారసుడు ఆదిత్య లక్ష్మారావుకు, ముదిరాజ్ సంఘం నాయకులకు మధ్య వివాదం కొనసాగుతోంది. భవన నిర్మాణం కూల్చివేతకు ఇటీవలనే లక్ష్మారావు కోర్టు ఆర్డర్ తీసుకొచ్చారు. దీనిపై ముదిరాజ్ సంఘం నాయకులు న్యాయపోరాటం ప్రారంభించారు. ఈ క్రమంలోనే మున్సిపల్ అధికారులు ముదిరాజ్ సంఘం వనం వద్ద ఎవరూ లేని సమయంలో ప్రహరీని, కార్యాలయాన్ని కూల్చివేసి, సామాగ్రిని బయట పడేశారు. మున్సిపల్ సిబ్బంది కూల్చివేత పనులు పర్యవేక్షించారు. ఈ ఘటనపై ముదిరాజ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్‌ఐ హృషికేష్‌ను కోరారు. పట్టణంలోని 10 వబ్లాక్‌లో నిర్మాణం కూల్చాలని కోర్టు ఉత్తర్వులు ఇస్తే మున్సిపల్ అధికారులు మాత్రం 3 వబ్లాక్‌లో ఉన్న ముదిరాజ్ సంఘ భవనాన్ని కూల్చివేశారని ఆయన ఆరోపించారు. తమకు న్యాయం చేయకుంటే నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు. భవనం కూల్చివేతను పలువురు ప్రజాసంఘాల నాయకులు ఖండించారు.